క్లుప్తంగా

నేటి నుంచి పరివార్ అభియాన్ కార్యక్రమం

తెనాలిఅర్బన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నుంచి అక్టోబర్ 2వరకు జరిగే స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్య వంతమైన మహిళ – శక్తి వంతమైన కుటుంబం) కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడటం, కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తెనాలి నియోజకవర్గ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లు, జిల్లా వైద్యశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళల్లో గుండెజబ్బులు, మధుమేహం, నోటీ, గర్భాశయ క్యాన్సర్ వంటి పరీక్షలను చేయడం జరుగుతుందన్నారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. కఠారి అంజయ్య, బేబి సరోజినిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, షేక్ మౌలాలి, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని వెనక్కు తీసుకోండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండు శివ

తెనాలిఅర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీ విధానంలో ప్రైవేట్‌పరం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండు శివ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్ర సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జీవోనెంబర్ 107, 108ని రద్దు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు కాలేదాని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్ అందడం లేదని, ఆ సమస్యను మంత్రి పరిష్కరించాలని కోరారు. విద్యార్థులకు నష్టం కలిగించే ప్రభుత్వ విధానాలు వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నేడు మహిళలకు సీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం

కొల్లిపర: అసంక్రమిత వ్యాధుల నివారణ కోసం, మహిళలు ఆరోగ్యవంతులుగా ఉండటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం ద్వారా బుధవారం కొల్లిపర గ్రామంలోని సీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో మహిళలకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, తల్లి బిడ్డ సేవలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్ , మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రక్తదానం శిబిరం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున మండలంలోని 20 గ్రామాలలోని మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మళ్లీ ఈనెల 24న కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

డాక్టర్ కోడెల శివప్రసాదరావుకు నివాళి



తెనాలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ మంత్రిత్వ పదవులు నిర్వహించి, విభజిత ఆంధ్ర ప్రదేశ్ స్పీకరుగా పనిచేసిన డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు సేవలు చిరస్మరణీయమని పలువురు స్మరించుకున్నారు. రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి ఆధ్వర్యంలో స్థానిక జేఎంజే మహిళా కాలేజీ నిర్వహణలోని స్వధార్ హోంలో మంగళవారం రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద రావు వర్ధంతిని నిర్వహించారు. డాక్టర్ శివప్రసాదరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వైద్యుడిగా, రాజకీయనేతగా, ప్రజాప్రతినిధిగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం స్వధార్ హోంలోని ఆశ్రితులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బొద్దులూరి వేణు, కనగాల నాగభూషణం, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, నిజాముద్దీన్, సలాం, విష్ణు, సాంబశివరావు పాల్గొన్నారు.

పని అనుభవంపై రైతు సదస్సు



సదస్సు ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ పీఎంవీ రావ్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ విజయబాబు

- నేర్చుకున్న విద్య రైతులతో పంచుకోవడం అభినందనీయం
- ఇన్‌చార్జ్ ఏడీఏ ఆర్.విజయబాబు
- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

తెనాలిటౌన్: రైతులకు గ్రామీణ అవగాహన పని అనుభవంపై రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇన్‌ఛార్జి ఏడీఏ ఆర్.విజయబాబు పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో మంగళవారం రైతులకు గ్రామీణ అవగాహన పని అనుభవంపై రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజ్ఞాన్ విశ్వ విద్యాలయం వడ్లమూడి విజ్ఞాన్ వ్యవసాయ సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజ్ఞాన్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ పీఎంజీ రావు తెనాలి ఇన్‌ఛార్జి ఏడీఏ ఆర్.విజయబాబు, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు పాల్గొని రైతు సదస్సును ప్రారంభించారు.

రిజిస్ట్రార్ పీఎంజీ రావ్ మాట్లాడుతూ విద్యాలయంలోని అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థులు మండలంలోని వివిధ గ్రామాల్లో 3 నెలల పాటు వారు నేర్చుకున్న విద్యను రైతులతో పంచుకోవడంతో పాటు ప్రత్యక్షంగా రైతులతో పాల్గొని పంట పొలాలను పరిశీలించి రైతులతో మమకమై మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకున్నట్లు చెప్పారు. సమీకృత, ప్రకృతి వ్యవసాయం, సోలార్ విధానం, ఎరువుల యాజమాన్య పద్ధతులు వంటి పలు విషయాలపై విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యుదయ రైతులు, రైతులు ఈ సదస్సులో పాల్గొని విద్యార్థులు విధానాన్ని తెలుసుకున్నట్లు వివరించారు. నేర్చుకున్న అంశాలపై రైతులకు విద్యార్థులు విశదీకరించినట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఏడీఏ ఆర్.విజయబాబు మాట్లాడుతూ ఆధునీక వ్యవసాయ పద్ధతులపై విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించడంతో పాటు విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ డీన్, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ తాతినేని రమేష్‌బాబు, సమన్వయకర్తలు డాక్టర్ ఎం.చంద్ర సూర్యరావు, డాక్టర్ ఎన్.హరీష్, సర్పంచ్ చొప్పర ప్రీతి, వీఏఏ నాగరాజు, అభ్యుదయ రైతు అంచ రోశయ్య, విద్యార్థినీ విద్యార్థులు, రైతుల పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి పోరుబాట

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు



అధ్యయన యాత్ర చేస్తున్న నాయకులు

తెనాలి: చేనేత సహకార సంఘాల, సహకారేతర కార్మికుల ఉపాధికోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న చేనేత అధ్యయన యాత్ర మంగళవారం తెనాలి చేరుకుంది. కృష్ణాజిల్లా పెడనలో ఈనెల 11వ తేదీన ఈ యాత్ర ప్రారంభమైంది. తెనాలి ఆర్టీసీ బస్ స్టేషనుకు యాత్ర రాగానే చేనేత కార్మికులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. తెనాలిలోని చేనేత కార్మికులు ఎక్కువగా నివసించే సాలిపేట, షరాఫ్‌బజారు, ప్రగడకోటయ్య నగర్‌లో కార్మికులను కలిసింది. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రిబేటు, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, పావలా వడ్డీ, మార్కెటింగ్ ఇన్సెంటివ్ రూ.127.87 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు జరిపించాల్సి ఉందన్నారు. మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నేతన్న భరోసా పథకం కింద రూ.36 వేలను ఇవ్వాలని కోరారు. చేనేత బ్యాంకును ఏర్పాటుచేసి సబ్సిడీ రుణాలను పంపిణీ చేయాలని కోరారు. మొత్తం 12 సమస్యలను పరిష్కరించాలనేది తమ డిమాండ్‌గా తెలిపారు. చేనేత పరిశ్రమను రక్షించుకుందాం... పోరుబాట సాగిద్దాం ... పేరుతో సాగుతున్న ఈ ఉద్యమ యాత్రలో చేనేతలు, చేనేత పరిశ్రమ శ్రేయోభిలాషులు భాగస్వాములు కావాలని సూచించారు.

రాష్ట్ర కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ మాట్లాడుతూ అధ్యయన యాత్ర గురించి చేనేత కార్మికులకు వివరించారు. చేనేత పరిశ్రమ ఘోరమైన సంక్షోభంలో ఉందన్నారు. పాలక ప్రభుత్వాలు చేనేత కార్మికులు, పరిశ్రమపై నిర్లక్ష్య వైఖరితో ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర కోశాధికారి బత్తూరి మోహనరావు, జి.వెంకటకృష్ణ, ఉమామహేశ్వరరావు మాట్లాడారు. చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుంగ బాలస్వామి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారి ప్రసాదరావు జీవితం ఆదర్శప్రాయం

వర్ధంతి సభలో వక్తల నివాళి



ప్రసాదరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సభ్యులు

తెనాలి: రూరల్ మండలం తేలప్రోలు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (ఉర్దూ బాలికలు)లో మంగళవారం సాయంత్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివర డీజీపీగా పని చేసిన డాక్టర్ బయ్యారపు ప్రసాదరావు 69వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు సంస్థ చైర్మన్ ఆళ్లమూడి ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. తేలప్రోలు గ్రామంలో జన్మించి ప్రసాదరావు ఐపీఎస్ అధికారిగా పనిచేసి డీజీపీ స్థాయికి ఎదిగారని ప్రభాకరరావు చెప్పారు. తెనాలి కోర్టు సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐపీఎస్ అధికారి ప్రసాదరావును ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఎదగాలని సూచించారు. విద్యార్థులకు స్వీట్స్, నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్, ఏరేజర్స్ సునీల్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయిని షేక్ రుక్సానా, టీచర్ టీఎస్ఎల్ శైలజ, గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.పద్మావతి, సచివాలయం సిబ్బంది టీహెచ్ భార్గవి, కనపర్తి అనూష, మాజీ ఎంపీటీసీ వేజెండ్ల ఇశ్రాయేలు, అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గాదెలవర్తి ప్రభాకరరావు, వేజెండ్ల రత్నం, అత్తోట చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎరుకుల సేవాసంఘం నేతకు సత్కారం



శంకరరావును సత్కరించిన వివిధ సంఘాల నేతలు

తెనాలి: బాండెడ్ లేబర్ సిస్టమ్ అబాలిషన్ యాక్ట్–1976 ప్రకారం గుంటూరు జిల్లాలో ఏర్పాటైన జిల్లా విజిలెన్స్ కమిటీలో సభ్యుడిగా నియమితులైన ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరావును అభినందనీయులని పలువురు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటైన సభకు వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. వివిధ సంఘాల నాయకులు హాజరై శంకరరావును సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. రాష్ట్ర గిరిజన నాయకుడు కట్టా బుల్లయ్య, వైకుంఠపురం ట్రస్ట్ బోర్డు సభ్యుడు బొద్దులూరి నాగేశ్వరరావు, ఎరుకల సేవాసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గరిక శ్రీనివాసరావు, హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ సంస్థ వ్యవస్థాపకుడు మొగిలి ఏడుకొండలు, దేవరకొండ రాజేష్, సీపీఐ ఎంఎల్ దుగ్గిరాల నేత కట్టా కాశేశ్వర రావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు దేవరకొండ గోపి, యానాది సంఘం తెనాలి డివిజన్ అధ్యక్షుడు పొట్లూరి అశోక్, రాపూరి నాగరాజు, పేరం సాంబ శివరావు, యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, ఉన్నవ సాల్మన్, నల్లగండ్ల రవిచంద్ర పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు 'సంక్షేమాన్ని' అమలు చేయాలి

సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ



కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పారిశుద్ధ్య కార్మికులకు కూడా అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ కోరారు. మంగళవారం తాడేపల్లిరూరల్ పరిధిలోని కొలనుకొండలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని కోరుతున్నామన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, గ్లౌజులు, చెప్పులు వెంటనే మున్సిపల్ అధికారులు కార్మికులకు అందజేయాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కమిటీని ఏర్పాటుచేశారు. గ్రామ అధ్యక్షుడిగా పాపయ్య, ఉపాధ్యక్షులుగా బేబి, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా అంగమ్మ, కోశాధికారిగా కె.రాజును ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో మహిళలకి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని వల్లభాపురం గ్రామం సమీపంలోని కృష్ణా నది కరకట్టపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం గ్రామానికి చెందిన బత్తు సుశీల విజయవాడ నుంచి అంబులెన్స్‌లో కరకట్ట మీదుగా వస్తున్నారు. అయితే కొల్లిపర నుంచి విజయవాడకు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి అంబులెన్స్‌ను ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మహిళకు తీవ్రగాయాలవటంతో 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నలుగురు ఉపాధ్యాయులకు గురుసత్కారం



తెనాలి: ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన గురుపూజా మహోత్సవంలో తెనాలికి చెందిన నలుగురు ఉపాధ్యాయ ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులను అందుకున్నవారిలో తెనాలికి చెందిన డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవి, మామిడాల నివేదిత, లక్కరాజు లక్ష్మణరావు, జొన్నలగడ్డ శ్రీరామచంద్రమూర్తి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ, ఉపాధ్యక్షుడు మంగోళంపల్లి అంజిబాబు, కోశాధికారి కౌతా వేంకట సుబ్బారావు పర్యవేక్షించారు.

కలగా రాష్ట్రంలో సినీపరిశ్రమ అభివృద్ధి

తెనాలిరూరల్: సినిమా చిత్రీకరణలకు, థియేటర్ల కోసం పొందాల్సిన అనుమతులన్నిటినీ తెలంగాణలో తాజా గా సింగల్ విండో ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిందని, ఆంధ్రాలో సినీ పరిశ్రమాభివృద్ధి గురించి పట్టించుకునే వారే లేరని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా–ఏపీ)వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్‌రాజా ఆరోపించారు. 'ఫిలింస్ ఇన్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక వెబ్ సైట్ ను ఏర్పాటుచేయడం వలన అంతర్జాతీయ సినిమా నిర్మాణాలకు సైతా కేవలం స్క్రిప్టుతో వస్తే ఆయా సినిమాలకు కావాల్సిన లోకేషన్‌లు, వివిధ శాఖల అనుమతులు వస్తాయన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రలో సినీపరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలను ప్రత్యేక బిల్లుగా ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.

గురువు కోసం విద్యార్థుల రక్తదానం



తెనాలి: స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ జన్మదినం రోజైన మంగళవారం 2023–26 బ్యాచ్ బీసీఏ కోర్సు చదువుతున్న ఫైనలియర్ విద్యార్థులు రక్తదానం చేశారు. స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి, స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిలో విద్యార్థులు హర్ష, వేమ చిన్ను, షేక్ బాషా, కార్తీక్ చందు, యు.నాగసాయి, షేక్ షాహిద్, షేక్ అమీన్, ఆర్.జయసాయి, కె.ఆనందపాల్, కె.మోక్షజ్ఞ, ఎం.శ్రీరామ్, ఎం.లలితేష్ ఉన్నారు. కాలేజీకి చెందిన మరికొందరు విద్యార్థులు పాతశివాలయం వీధిలో పేదలకు ఆహార పొట్లాలు, మంచినీటి సీసాలను పంపిణీ చేశారు. విద్యార్థుల కోరికపై డాక్టర్ రామ్‌చంద్ స్వయంగా పాల్గొని, ఆహార పొట్లాలను అందజేశారు.

వ్యవసాయ క్షేత్రాలు పరిశీలించిన తమిళనాడు బృందం



కూరగాయల సాగును పరిశీలిస్తున్న సభ్యులు

కొల్లిపర: తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు చెందిన 32 మంది బృందం సభ్యులు ప్రకృతి వ్యవసాయ ప్రభావం పై ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం మొదటి రోజు కొల్లిపర మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటలను స్వయంగా బృందం పరిశీలించింది. గ్రామాల్లో రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమాలైన న్యూట్రీ గార్డెన్లు, కిచెన్ గార్డెన్లు ఎలా పోషకాహార భద్రతను కల్పిస్తాయో, గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిని ఎలా మెరుగుపరుస్తాయో వంటి అంశాలను అన్నవరం గ్రామంలో నక్క శిరీష పాటిస్తున్న సూర్యమండల మోడల్, పాతబొమ్మువానిపాలెం గ్రామంలో నాగజ్యోతి అమలు చేసిన 365 రోజుల కూరగాయల సాగు మోడల్, తూములూరుగ్రామంలో భూలక్ష్మి సాగు చేస్తున్న ఎనీటైం మనీ పంటలను ఆయా గ్రామాలల్లో బృందం పర్యటించి అక్కడ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంటల వివరాలను రైతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం బృందం ఆరోగ్య, పోషణ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్, రైతులు, హెల్త్, న్యూట్రిషన్ ఫెలోస్, స్వయం సహాయ బృందాల మహిళలతో మాట్లాడి పకృతి వ్యవసాయంలో వారు సాగు చేస్తున్న పంటల ఎంపిక, తోటల పరిమాణం, మల్టీ–లేయర్ డిజైన్లు, నేల సిద్ధం, జీవ ఉత్ప్రేరకాల వినియోగం, పంటల్లో కీటకాలు–వ్యాధుల నియంత్రణ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రసాయన రహిత కూరగాయల ప్రాధాన్యం, గ్రామస్థాయిలో న్యూట్రీ గార్డెన్లను వంటివి ఏర్పాటు చేయడం వలన వచ్చే ఆహార, పోషక భద్రత గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ ఈ పర్యటన వలన తమిళనాడులో న్యూట్రీ గార్డెన్లను విస్తరించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగిరెడ్డి



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ నాగిరెడ్డి

తెనాలిటౌన్: వర్షాకాలం సీజనల్ వ్యాధిలా పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుందని, నివారణకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని పశువైద్యశాలలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. డాక్టర్ నాగిరెడ్డి పాల్గొని పశువులకు టీకాలు వేసి మాట్లాడారు. గెదేల్లో వర్షకాలం ఎక్కువగా గాలికుంటు వ్యాధి సోకుతుందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, నోటిలో పుండ్లు, కాలిగిట్లమధ్య పుండ్లు, సొంగకారడం, మేత తినకపోవడం వంటి లక్షణాలు కనబడతాయని చెప్పారు. పాడుగు ఆరిపోయి పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి గాలికుంటు నివారణ టీకాలు పశువులకు వేయడం జరుగుతుందని అన్నారు. గాలికుంట సోకిన సూడిపశువులు ఈసుకుపోతాయని చెప్పారు. ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు దూడల దగ్గర నుంచి గెదేలకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని 12,628 పశువులకు ఐదు వెటర్నరీ హాస్పటల్స్, ఆరు పారా వెటర్నరీ డిస్పెన్సరీలు, 2 ఆర్ఎస్‌కేలు, గోపాలమిత్రలలో టీకాలు వేస్తున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవన ఎరువులపై రైతులు అవగాహన పెంచుకోండి

జిల్లా రిసోర్స్ కమిటీ ఏడీఏ ఐ.సునీత



ఎరువులను పంపిణీ చేస్తున్న ఏడీఏ సునీత

తెనాలిటౌన్: భూసారాన్ని పెంపొందించే జీవన ఎరువులను రైతులు వినియోగించి భూమి సహజత్వాన్ని కాపాడుకోవాలని జిల్లా రిసోర్స్ కమిటీ సహాయ సంచాలకులు ఐ.సునీత తెలిపారు. రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో మంగళవారం రైతులకు జిల్లా రిసోర్స్ కమిటీ గుంటూరు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏడీఏ ఐ.సునీత పాల్గొని జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. జీవన ఎరువులు నేలసారాన్ని పెంపొందించి మొక్కలకు పోషకాలను అందిస్తాయని తెలిపారు. తద్వారా పంట పెరుగుదలకు దోహదపడతుందని వివరించారు. గాలిలో నత్రజని మొక్కలు గ్రహించలేని రూపం నుంచి మొక్కలు ఉపయోగించుకునే రూపంలోకి మార్చి నేలలోని కరగని ఫాస్పెట్‌లను కరిగించి మొక్కలకు అందుబాటులోకి ఉండే రూపంలోకి మారుస్తాయని వివరించారు. మొక్కల పెరుగుదలను ప్రోత్సాహించే హార్మోనులు, విటమిన్లు, ఎంజేమ్‌లను ఉత్పత్తి చేస్తాయని తెలిపారు. రైజోబియం , అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, నీలి ఆకుపచ్చ శైవలాలు వంటి జీవన ఎరువుల రకాలు ఉంటాయని వివరించారు. జీవన ఎరువుల వినియోగం వలన రసాయన ఎరువుల వాడకం దాదాపుగా తగ్గించుకోవచ్చని చెప్పారు. నేల సహజత్వాన్ని దెబ్బతీయకుండా భూసారాన్ని పెంపొందిస్తాయని, తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ ఆర్.విజయబాబు, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వాడకం చేపట్టాలి

మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు



మాట్లాతున్న ఏవో కె.సుధీర్‌బాబు

తెనాలిటౌన్: వరి, జొన్న, మొక్కజొన్న పంటల సాగులో రైతులు నానో ఎరువుల వాడకం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులోని డీసీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం రైతులకు నానో ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు పాల్గొని మాట్లాడారు. సాంప్రదాయ ఎరువుల కంటే నానో ఎరువుల వాడకం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా వరి, జొన్న, మొక్కజొన్న సాగుచేసే రైతులు నానో ఎరువుల వినియోగించాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్ఎఫ్‌సీవో జిల్లా మేనేజర్ రఘు మాట్లాడుతూ నానో ఎరువులు, ఉచిత ప్రమాద బీమా, కిసాన్ డ్రోన్‌ల వినియోగం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

శతాధిక నాటకకర్త కొడాలి గోపాలరావు

సంస్మరణ సభలో నివాళి



మాట్లాడుతున్న బెజ్జంకి నాగమణి

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలిశాఖ ఆధ్వర్యంలో ఇక్కడి గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో జరుగుతున్న అమర కళాకారుల సంస్మరణలో భాగంగా మంగళవారం సాయంత్రం శతాధిక నాటకకర్త కొడాలి గోపాలరావు సంస్మరణను నిర్వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి బెజ్జంకి నాగమణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గోపాలరావు వందకు పైగా నాటకాలు రచించినట్టు తెలిపారు. ఆయన నాటకాలు ఆనాడు ఆంధ్రదేశంలో ప్రతిచోటా ప్రదర్శనకు నోచుకున్నాయనీ చెబుతూ అవన్నీ ప్రజలను చైతన్యపరచాయని వివరించారు. నటుడు దేవిశెట్టి కృష్ణారావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి, బుర్రకథ కళాకారిణి శివపార్వతి, యామిని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలుత గోపాలరావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.